క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి



ఐసీయూ విభాగాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

నెహ్రూసెంటర్: ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు వైద్య ఆరోగ్యశాఖ నిబంధనలు పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రమీల రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పానుగోటి ఆసుపత్రిని శుక్రవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఐసీయూ, ఆపరేషన్ థియేటర్, జనరల్ వార్డు, ఓపీ విభాగాన్ని పరిశీలించారు. ఓపీ రిజిస్టర్లు రెగ్యూలర్‌గా నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రిలో పని చేస్తున్న వైద్యులు, సిబ్బంది సర్టిఫికెట్లను డీఎంహెచ్ఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్య ఆరోగ్యశాఖ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్‌యూఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో సీట్లు



మహబూబాబాద్ రూరల్: బాసర ట్రిపుల్ ఐటీలో 2025లో మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇందూర్తి ధనుంజయ్, వెంపటి విఘ్నేశ్ సీట్లు సాధించారని హెచ్‌ఎం జి.ఉప్పలయ్య శుక్రవారం తెలిపారు.

ఆర్థికసాయం



మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లిలో కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త తాపిమేస్త్రీ అక్కెనపల్లి పెద్ద యాకయ్య బ్రెయిన్ స్ట్రోక్‌తో ఇటీవల మృతిచెందాడు. 3వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాడిపల్లి రవి ఆధ్వర్యంలో శుక్రవారం బాధిత కుటుంబానికి రూ.11వేల ఆర్థిక సాయం అందజేశారు.

పీరీల సందడి



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బేతోలులో గ్రామంలో పీరీల సవార్ల సందడి భక్తిశ్రద్ధలతో శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమంలో గ్రామపెద్ద షేక్.యూసుఫ్, మత పెద్దలు, మొహరం కమిటీ బాధ్యులు మస్తాన్, మొహుద్దీన్, మైబు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

నెల్లికుదురు: భూ భారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు చేసుకున్న బాధిత రైతుల భూముల విచారణ సరైన పద్ధతిలో పరిశీలన పూర్తి చేయాలని తొర్రూరు ఆర్డీఓ గణేష్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద నరేష్, డిప్యూటీ తహసీల్దార్ తరంగిణి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కేసు నమోదు

పెద్దవంగర: వివాహిత మృతికి కారణమైన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతి కిరణ్ శుక్రవారం తెలిపారు. జిల్లా పెద్దవంగర మండలంలోని అవుతాపురం గ్రామానికి చెందిన వేముల ఝాన్సీ (32) గురువారం ఆత్మహత్య చేసుకుంది. భర్త సంతోష్ స్థానికంగా సీఆర్పీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఘటన జరిగిన సమయంలో భర్త ఇంట్లో లేడు. దంపతులకు అఖిల్ తేజ, అభిదామిని ఇద్దరూ పిల్లలు ఉన్నారు. మృతురాలు తండ్రి చింతకింద వెంకట సోమయ్య తన కూతురు మరణంపై సల్దెండి ప్రవీణ్, చిదిరాల రాజులపై అనుమానం ఉందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరాలు వెల్లడించారు.

వైద్యశిబిరం

నర్సింహులపేట: మండలంలోని పెద్దనాగారం ఉపకేంద్రంలో శుక్రవారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కవిత ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు చేశారు. 120 మందికి వైద్య పరీక్షలు చేసి అందులోని 80మందికి బీపీ, సుగర్ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రేవతి, హెల్త్ అసిస్టెంట్ చలపతి పాల్గొన్నారు.
దంతాలపల్లి: గ్రామీణ ప్రాంతాలలో ప్రజల ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దని పెద్దముప్పారం పల్లె దావాఖాన వైద్యురాలు వాణి అన్నారు. దంతాలపల్లి వైద్యురాలు కవిత ఆదేశాల మేరకు పీహెచ్‌సీ పరిధిలోని ఆగపేట గ్రామంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు.

శిథిలావస్థలో గ్రంథాలయం

- చెదలుపడుతున్న పుస్తకాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



చెట్లు చెదారంతో శిథిలావస్థలో గ్రంథాలయం

చిన్నగూడూరు: ప్రజలకు విజ్ఞానాన్ని అందించాల్సిన విజ్ఞాన భాండాగారం పాలకుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారి నేడు శిథిలావస్థకు చేరుకుంది. 'నాతెలంగాణ కోటి రతనాల వీణ' అని వెలుగెత్తి చాటిన మహనీయుడు దాశరథి కృష్ణమాచార్యులు పుట్టిన పురిటిగడ్డ మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు. ఆ గొప్ప మహనీయుడి నామకరణంతో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దాశరథి గ్రంథాలయం నేడు శిథిలావస్థకు చేరుకుంది. గ్రామీణ ప్రాంత ప్రజలతోపాటు ఉద్యోగాలకు ప్రిపేరయ్యే నిరుద్యోగులకు విజ్ఞానాన్ని అందించాలనే లక్ష్యంతో 2012లో పాత పంచాయతీ భవనంలో స్థానికులే చందాలు వేసుకుని గ్రంథాలయం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకున్నా దాతల సహకారంతో ఐదేళ్లుగా గ్రంథాలయం కొనసాగింది. గ్రంథాలయ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించకపోవడంతో పాఠకులకు సరైన రీతిలో సేవలందించక గ్రంథాలయం మూతపడింది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు, నిరుద్యోగులకు ఉపయోగపడాల్సిన విలువైన పుస్తకాలు, గ్రంథాలు వానకు తడిసి చెదలు పడుతున్న దుస్థితి నెలకొంది. గ్రంథాలయం చుట్టూ చెట్లు పెరిగి చెత్తాచెదారంతో విషపురుగులకు నిలయంగా మారింది. ఏళ్లు గడుస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు మారడం తప్ప గ్రంథాలయాన్ని పట్టించుకునే నాథుడే లేరంటూ మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయాన్ని పడగొట్టి గ్రంథాలయానికి పక్కా భవనాన్ని నిర్మించాలని పాఠకులు, స్థానికులు కోరుతున్నారు.

గ్రంథాలయ భవనం నిర్మించాలి



మహనీయుడి పేరిట ఏర్పాటు చేసిన గ్రంథాలయం మూతపడి శిథిలావస్థకు చేరుకుంది. శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చి నూతన భవనం నిర్మించాలి. గత ప్రభుత్వంలో పలుమార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడున్న ప్రభుత్వమైనా స్పందించి నూతన భవనాన్ని నిర్మిస్తే అందరికీ అందుబాటులో ఉంటుంది.

- గాడిపెల్లి సత్యనారాయణ, గ్రంథాలయం చైర్మన్

దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న విజయకాంత్

డోర్నకల్: తొడేళ్లగూడెంలో దళితులపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు ఎల్.విజయకాంత్ డిమాండ్ చేశాడు. మండలంలోని తొడేళ్లగూడెం గ్రామంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మోహర్రం సందర్భంగా డప్పులు కొడుతున్న దళితులపై కొంతమంది ముదిరాజ్‌లు దాడి చేసి గాయపర్చడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దళితులపై దాడి చేసి గాయపర్చిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బందెల కిరణ్, గుద్దేటి మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

కురవి: మండల కేంద్రంలో నేటినుంచి జరిగే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కురవిలో శనివారం(5న) సీపీఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, తురక రమేష్, సమ్మయ్య, కన్నె వెంకన్న, సారయ్య, నాగరాజు, బస్వ కొమురయ్య పాల్గొన్నారు. కాగా బహిరంగ సభస్థలాన్ని డోజర్‌తో శుభ్రం చేయించారు.
గార్ల: కురవిలో నేడు, రేపు నిర్వహించే సీపీఐ పార్టీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి రాగం రమేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం గార్లలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనార్దన్, వెంకన్న, వెంకన్న, భిక్షం శ్రీను పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్ష

కేసముద్రం: ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రకారంగా తమకు పట్టాపాస్ బుక్కులు అందించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని నారాయణపురం గ్రామంలో రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 4వ రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, నర్సింహరెడ్డి, విష్ణురెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

అందుబాటులో వరివిత్తనాలు

బయ్యారం: జాతీయ ఆహారభద్రత పథకం(ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం)లో భాగంగా రైతులు వానాకాలంలో సాగు చేసేందుకు రెండురకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి రాంజీ తెలిపారు. శుక్రవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటనను విడుదల చేశారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



కేసముద్రం: మాట్లాడుతున్న నాయకులు

కేసముద్రం: జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి శివారపు శ్రీధర్, సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్, ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి మంత్రిపల్లి మొగిలి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయ మాట్లాడారు.
బయ్యారం: ఈనెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెలో తాము పాల్గొంటున్నామని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశకార్యకర్తలు శుక్రవారం గంధంపల్లి వైద్యాధికారికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ వల్లాల వెంకన్న, నాయకులు ఆనందరావు మాట్లాడారు.
గూడూరు: జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్ యాదవ్ అన్నారు.

జెడ్పీహెచ్‌ఎస్‌లో లీడర్‌షిప్ ఎన్నికలు



ఓటు వేస్తున్న విద్యార్థిని

డోర్నకల్: స్థానిక పీఎంశ్రీ జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం విద్యార్థులకు లీడర్‌షిప్ ఎన్నికలు నిర్వహించారు. పోలింగ్ విధానంలో నిర్వహించిన ఎన్నికల్లో ఏర్పాటు చేసిన ఐదు బూతులలో సుమారు 220మంది విద్యార్థులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు నిర్వహించి విజేతలను ప్రకటించారు. అధ్యక్షుడిగా కె.రాజేష్, ఉపాధ్యక్షుడిగా నటంకర్ హాన్యా నిహార్, దోనోజు లక్ష్మీప్రసన్న, జనరల్ సెక్రెటరీగా అజ్మీర స్వాతి, గేమ్స్ సెక్రెటరీగా శ్యామ్ నిఖిల్, కల్చరల్ సెక్రెటరీగా శ్యామ్ సంతోష్ ఎన్నికయ్యారు. విజేతల ప్రమాణస్వీకారం అనంతరం బాలసభ నిర్వహించారు.

ఆర్మీ జవాన్లకు ఘన సన్మానం



గూడూరు: జవాన్ నవీన్‌గౌడ్‌కు సన్మానం..

గూడూరు: మండల కేంద్రానికి చెందిన గొడిశాల నవీన్‌గౌడ్ సైనికుడిగా సేవలు అందించి, ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొని దిగ్విజయంగా ఇంటికి తిరిగి వచ్చిన సందర్భంగా శుక్రవారం హర్ సైనిక్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గొడిశాల నవీన్‌గౌడ్ దంపతులతోపాటు ఆయన తల్లిదండ్రులు సారయ్యగౌడ్ దంపతులను జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలునాయక్, బీరం శ్రీపాల్‌రెడ్డి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. మండలంలోని సీతానగరంకు చెందిన కోమాండ్ల ప్రకాష్, బొల్లెపల్లికి చెందిన హెచ్. ప్రశాంత్, గడ్డం రఘు అనే జవాన్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఎక్స్ ఆర్మీ, ఐజీ ఆఫీస్ సీఐ శివనాధుల శ్రీనివాస్, ఎక్స్ ఆర్మీ సర్వీస్‌మెన్ సత్యనారాయణ, అనిల్‌కుమార్, రఘు పాల్గొన్నారు.
డోర్నకల్: ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్న డోర్నకల్‌కు చెందిన రఘును స్థానికులు ఘనంగా సన్మానించారు. ఆపరేషన్ సిందూర్‌లో పాలొన్న తరువాత డోర్నకల్‌కు చేరుకున్న రఘుకు స్థానికులు డోర్నకల్ రైల్వేస్టేషన్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. సీఐ బి.రాజేష్ రఘును సన్మానించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణవ్యాస్, గణేష్‌నాయక్, దేవానాయక్, రెహమాన్ పాల్గొన్నారు.

సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



మరిపెడ నుంచి వెళ్తున్న నాయకులు



పెద్దవరంగలో..

హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సభకు జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి కార్యకర్తలు బస్సులో తరలివెళ్లారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు జెండా ఊపి బస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్

మహిళలు స్వయంశక్తితో రాణించాలి

మరిపెడ రూరల్: డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో మహిళలు స్వయం శక్తితో అన్నిరంగాల్లో రాణించాలని ట్రైనర్ పంజాల ఇందిర అన్నారు. మరిపెడ మండల స్త్రీ శక్తి భవనంలో వీఓ సంఘాలు మూడు రోజులుగా శిక్షణ తరగతుల చేపట్టగా నేడు శుక్రవారంతో ముగిశాయి. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఎవరిపై ఆధారపడకుండా వారి కాళ్లపై వారు నిలబడాలన్నారు. మహిళా సంఘాలకు బ్యాంకులో రుణాలు అందిస్తున్నారని, సకాలంలో చెల్లించి మళ్లీ రుణం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రాములు, సీఆర్‌సీలు నాగలక్ష్మీ, ఉపేంద్ర, ఉమ పాల్గొన్నారు.

ప్రజలకు కాంగ్రెస్ ఏమిచ్చిందో చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే హరిప్రియ



ఆందోళనలో పాల్గొన్న హరిప్రియ, నాయకులు

బయ్యారం: మేమిస్తాం.. మేమిస్తాం అని పలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఏమిచ్చిందో చెప్పాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. గ్రామపంచాయతీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, ఆరుగ్యారంటీలు, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బయ్యారంలో ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని బాలాజీపేట పంచాయతీలోని తీర్థతండాలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా ఇవ్వకపోవడం సరికాదన్నారు. కేసీఆర్ పాలనలో వర్షాకాలం వస్తుందంటేనే గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేసేవారన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రంను తహసీల్దార్ నాగరాజుకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గణేష్, సొసైటీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు ఐలయ్య, మురళీ, భద్రయ్య, లక్ష్మణ్‌నాయక్, శ్రీను పాల్గొన్నారు.

కమ్యూనిస్టులే నిజమైన దేశభక్తులు



అభివాదం చేస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్: దేశంలో నిజమైన దేశభక్తులు కమ్యూనిస్టులేనని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. సీపీఐ 16వ మండల మహాసభ ముడుపుగల్ గ్రామంలో తండ సతీష్, కొమ్ము నారాయణ, కౌసల్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా భారీ ర్యాలీ, నిర్వహించి అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి, పోరాట చిత్రాల ఫొటో గ్యాలరీ ఆవిష్కరించి, అనంతరం సీపీఐ జెండాను పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి ఎగురవేశారు. నేడు జరుగనున్న భారీ బహిరంగ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.అజయ్ సారథిరెడ్డి, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కట్లోజు పాండురంగాచారి, మండల కార్యదర్శి తండ సందీప్, బానోతు లింగ్యానాయక్, కొమ్ము నారాయణ, సతీష్, కౌసల్య పాల్గొన్నారు.

సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య



నెహ్రూసెంటర్: దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



మహబూబాబాద్: నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు



గార్ల: నివాళులర్పిస్తున్న నాయకులు



నర్సింహులపేటలో..

తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. నాయకులు ఆయన చిత్రపటం, విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య ఉద్యమ స్ఫూర్తితో హక్కుల సాధన కోసం ఉద్యమించాలన్నారు.

- సాక్షి నెట్‌వర్క్

సంక్షిప్త సమాచారం

సన్మానం

బయ్యారం: అమెరికా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన ఉపాధ్యాయుడు బి.కృష్ణమూర్తికి మండలంలోని గౌరారం యూపీఎస్‌లో శుక్రవారం ఉపాధ్యాయులు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ దేవేంద్రాచారి, హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు కొమిరె ఉప్పలయ్య, రవీందర్, మదార్, మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయాలి

నెహ్రూసెంటర్: ఎన్‌హెచ్ఎం కింద వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఉద్యోగులకు రెండు నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలని డాక్టర్ కందుల నాగరాజు శుక్రవారం ప్రభుత్వాన్ని కోరారు.

మోడల్ స్కూల్‌లో వైద్యశిబిరం

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామ మోడల్ స్కూల్‌లో శుక్రవారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పరిమి నవీన్, ఎఎన్‌ఎంలు హేమ, ప్రవళిక, ఉపాధ్యాయులు రమేష్, సురేందర్, నర్సయ్య, చంద్రమోహన్, పార్థసారథి, రమ్య పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

నెల్లికుదురు: గత సంవత్సరంలో గాలివాన బీభత్సానికి వరదలకు కొట్టుకుపోయిన ఇందిరమ్మ ఇల్లు రాలేదని బాధితుడు కోరుకొప్పుల నరేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. మండలంలోని రావిరాల గ్రామంలో శుక్రవారం బాధితుడు మాట్లాడాడు. సంబంధిత అధికారులు స్పందించి తన ఇంటిని పరిశీలించి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరాడు.

రూ.10వేల జరిమానా

గూడూరు: మద్యం తాగి కారు నడుపుతున్న మర్రిమిట్ట శివారు రాళ్లవాగుదస్రుతండాకు చెందిన వినోద్ అనే వ్యక్తి డ్రంక్‌అండ్‌డ్రైవ్‌లో పట్టుబడగా, శుక్రవారం జడ్జి రూ.10వేల జరిమానా విధించినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

ప్లేట్ల పంపిణీ

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులను ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు తల్లాడా వెంకట్రామారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటనర్సయ్య, నాగేశ్వరరావు, తిపిరిశెట్టి గోవర్ధన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నివాళి

సాక్షి నెట్‌వర్క్: మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు నాగరాజు, చంద నరేష్, డీటీ తరంగిణి, సిబ్బంది, సంఘం నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

గూడూరు: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మర్రిమిట్టకు చెందిన ధనసరి సాగర్ (24 ఓ పంచాయితీ విషయంలో తనను అవమానకరంగా దూషించారని మనస్తాపానికి గురయ్యాడు. దీంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు భార్య అనూష ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

డోర్నకల్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ డిమాండ్ చేసింది. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో యూనియన్ నాయకులు వినతిపత్రం అందించారు. జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మి, ఉపేంద్ర, సరోజ, దేవిక, ధనలక్ష్మి, మైబూబీ పాల్గొన్నారు.

దాడి కేసులో ముగ్గురి అరెస్ట్

బయ్యారం: మండలంలోని గంధంపల్లి గ్రామానికి చెందిన జర్నలిస్ట్ పిల్లల నరసింహారావుపై జరిగిన దాడి ఘటనలో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు గార్ల-బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి శుక్రవారం తెలిపారు. గంధంపల్లి గ్రామానికి చెందిన చల్లా సురేష్, ఖమ్మం జలగంనగర్‌కు చెందిన పసుపులేటి సాయికార్తీక్, పసుపులేటి సాయికృష్ణ ను పట్టుకొని విచారించగా నేరంను ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు.

డ్రైయినేజీ శుభ్రం చేయించిన మార్కెట్ చైర్మన్

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధి అంబేడ్కర్ సెంటర్‌లో రైల్వేఅండర్ డ్రైయినేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం, బండరాళ్లను శుక్రవారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి తీయించి శుభ్రం చేయించారు. దీంతో అక్కడున్న ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, గండి శ్రీనివాస్, యాకుబ్‌రెడ్డి పాల్గొన్నారు.

దయాకర్‌రావు జన్మదిన వేడుకలు



తొర్రూరు: రక్తదానం చేస్తున్న స్థానికులు

సాక్షి నెట్‌వర్క్: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు జన్మదిన వేడుకలు శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు రక్తదానం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

గార్ల: పెంచిన రైలు చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాస్ మాట్లాడారు. రైల్వేశాఖ ఇటీవల రైలు టికెట్ల ధరలను పెంచి ప్రయాణికులపై పెనుభారం మోపిందన్నారు. పెంచిన రైలు చార్జీల ధరలను రైల్వేశాఖ వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఈ ధర్నాలో సీపీఎం మండల కార్యదర్శి అలువాల సత్యవతి, పెద్దవెంకటేశ్వర్లు, నాగమణి, సీహెచ్ ఎల్లయ్య, రామకృష్ణ, వీరభద్రం, నాగరాజు, నరేష్, ఝాన్సీ, ప్రవీణ్, కోటయ్య, రమేష్ పాల్గొన్నారు.